క్లుప్తంగా

కేజీహెచ్ ప్రసూతి కేంద్రంలో నర్సింగ్ కియోస్క్ ప్రారంభం



కేజీహెచ్‌లో పబ్లిక్ నర్సింగ్ కియోస్క్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వాణి

మహారాణిపేట: తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కేజీహెచ్ గైనిక్ వార్డులో పబ్లిక్ నర్సింగ్ కియోస్క్‌ను శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ప్రారంభించారు. లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ప్రాజెక్టులో భాగంగా తల్లి, నవజాత శిశువులకు ప్రాథమిక వైద్యం, ప్రసవానంతర సంరక్షణకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లేడీస్ సర్కిల్ ఇండియా చైర్‌పర్సన్ జయశ్రీ, హిరావత్, డాక్టర్ దీప, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జి.సామిని, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రచారం



స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సీపీఎం ప్రతినిధులు

అల్లిపురం: అదానీ గ్రూపు సిబ్బంది స్మార్ట్ మీటర్లు బిగించేందుకు మీ ఇంటికి వస్తే ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జగదాంబ జోన్ ప్రతినిధి వై. రాజు ఆధ్వర్యంలో అల్లిపురంలోని చలువతోట ఏరియాలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళలు, ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు. స్మార్ట్‌మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కన్వీనర్ ఎం. సుబ్బారావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల విపరీతంగా పెరిగిన తరుణంలో విద్యుత్ గుదిబండ మనపై పడడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ చంద్రమౌళి, జగదాంబ జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం



స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, వైజాగ్ సురభి సభ్యులు

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ వైజాగ్ సురభి ఆధ్వర్యంలో శనివారం ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ పాఠశాలలో స్నేహితుల దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ కొత్తగా మొలకెత్తే మొక్కల మాదిరిగానే స్నేహాలు వికసించడం, వృద్ధి చెందడం జరుగుతాయన్నారు. ప్రకృతికి కృతజ్ఞతను తెలియజేసేలా ఫ్రెండ్‌షిప్ డేను జరుపుకోవాలన్నారు. దీనికి నిదర్శనంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, రోటరీ క్లబ్ వైజాగ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీలక్ష్మీదేవి, సభ్యులు డాక్టర్ బాలాజి సంతోష్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే వేంకటేశ్వర స్వామికి సుప్రబాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



రాత్రి వేళల్లో గంజాయి వినియోగించే వెంకటేశ్వరమెట్టపై మూడుగుళ్ల ప్రాంతం



నిత్యం గంజాయి వినియోగంతో యువత చిత్తవుతున్న బంగారుమెట్ట సులభ్ కాంప్లెక్స్



మత్తు పదార్థాలు ఆటోల్లో వినియోగిస్తూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్న బంగారుమెట్ట జంక్షన్

మత్తు.. ముంచెత్తుతోంది

- దక్షిణలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు
- వాటిని సేవించి జోగుతున్న యువత
- పోలీసుల ఉదాసీనతే కారణమంటున్న స్థానికులు

అల్లిపురం: ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత.. గంజాయి మత్తులో చిత్తవుతోంది. సరదాగా మొదలవుతున్న గంజాయి అలవాటు వ్యసనంగా మారుతోంది. గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రభుత్వం, పోలీసులు చెబుతున్నా వాస్తవరూపం దాల్చడం లేదు. పట్టణంలో 2వ టౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు ఏదో ఒక చోట గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేస్తున్నారు. తాజాగా 2వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జిల తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో ఐదుగురు నిందితులను రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా శుక్రవారం బంగారుమెట్టలో ఒక యువకుడిని అదుపులోకి తీసుకుని సుమారు కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ప్రధాన కూడలి కావటంతో..

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు మిళితమై ఉండటంతో బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది ఈ ప్రాంతంలోని లాడ్జిల్లో తిష్ట వేసి గంజాయి రవాణా, సరఫరాకు పాల్పడుతున్నారు. అందువల్లే లాడ్జిల తనిఖీల్లో అధికంగా గంజాయి స్మగ్లర్లు దొరుకుతున్నారు. వారంతా 20 నుంచి 30 సంవత్సరాలలోపు యువత కావటం విశేషం

కమీషన్ల ఎర..

నెట్‌వర్క్ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న గంజాయి స్మగ్లర్లు సరుకు రవాణా కోసం కమీషన్ల ఆశ చూపి అమాయకులను ఈ దందాలోకి లాగుతున్నారు. ప్రధానంగా కళాశాలల విద్యార్థులను అందుకోసం ఎంపిక చేసుకుంటున్నారు. రహస్యంగా గంజాయి తీసుకొస్తే కమీషన్ ముట్టజెబుతున్నట్లు సమాచారం. గంజాయి తాగుతూ పోలీసులకు దొరకగా.. వారిలో ఒకరు విక్రయించేవారు, మరొకరు కొత్తగా అలవాటు చేసుకున్న వ్యక్తి ఉండటం గమనార్హం. విశ్వసనీయ సమాచారం ఆధారంగా అడపాదడపా గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకోవడం తప్పితే.. ఆ దందా వెనకున్న బడా వ్యాపారులపై పోలీసులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? రవాణాకు సహకరిస్తున్నది ఎవరు? అన్నది గుర్తిస్తేనే పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే అవకాశముంది.



గంజాయి అమ్మకం, వినియోగం జరిగే టూటౌన్ పరిధిలోని కెప్టెన్ రామారావు జంక్షన్

మత్తు వ్యాపారం ఇలా..

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట, చలువతోట, తారాకరామాకాలనీ, బంగారుమెట్ట సులభ్ కాంప్లెక్స్, బంగారుమెట్ట జంక్షన్, వెంకటేశ్వరమెట్ట మూడుగుళ్ల ప్రాంతం, నేరెళ్లకోనేరు కాలనీ, చావులమదుం, భూపేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గంజాయి అమ్మకం, వినియోగం పెరిగిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చుస్తున్నారు. కొంత మంది సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కిలో రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసి ఆ గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అమ్ముతున్నారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు సైతం ఆయా ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో మత్తు పథార్థాలు వినియోగిస్తున్న మహారాణిపేట, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల ముగ్గురు యువకులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది.

- మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, కుమ్మరవీధి ప్రాంతానికి చెందిన సుంకరి సతీష్ అలియాస్ గుడ్డు బుర్రపై గంజాయి రవాణా, అమ్మకం ఆరోపణలపై ఏడాది పాటు నిర్బంధం విధించారు.
- మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, జిల్లాపరిషత్ దరి, వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన మేడిశెట్టి వరప్రసాద్‌పై గంజాయి రవాణా, అమ్మకం ఆరోపణలపై ఏడాది పాటు నిర్బంధం విధించారు.
- టౌన్ కొత్తరోడ్డు, పంజా జంక్షన్ ప్రాంతానికి చెందిన శీరం ఆకాష్‌పై గంజాయి అక్రమ రవాణా, అమ్మకాల ఆరోపణలపై ఏడాది పాటు నిర్బంధం విధించారు.

కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే..

ఎన్డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం ప్రకారం గంజాయి కిలో అంతకంటే తక్కువ పరిమాణంతో పట్టుబడితే.. ఆ వ్యక్తిని వినియోగదారుగా పరిగణిస్తూ చట్టంలోని 26, 27 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో నేరాభియోగం తక్కువగా ఉండటంతో బెయిల్ వెంటనే లభిస్తుంది. గంజాయితో పట్టుబడినా పెద్ద సమస్య లేకుండా బయటికి వస్తున్నామని భావించే కొందరు మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు కళాశాలల విద్యార్థులూ అందులో ఇరుక్కుంటున్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతాం..

మత్తు పదార్థాలు సేవించేవారు, క్రయవిక్రయాలు జరిపే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బీట్‌లు ఏర్పాటు చేశాం. గంజాయి సేవించడం ద్వారా శరీరంలో మానసిక మార్పులు వస్తాయన్న అపోహతో చాలామంది యువత అలవాటు చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన అనేక మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాము.

– వీవీసీఎం ఎర్రంనాయుడు, సీఐ, టూటౌన్

కొబ్బరితోటలో అధికం..



గంజాయి వాడకం ఈ మధ్య కాలంలో అధికంగా ఉంది. పలుమార్లు పోలీసులకు తెలిపినా.. ఫిర్యాదు చేసిన వారితో లోకేషన్ షేర్ చేయమని చెబుతున్నారు. దీంతో గంజాయి అమ్మకాలు, వినియోగం జరిగినా పోలీసులకు తెలియజేయడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయాల్లో ప్రత్యేక బీట్లు ఏర్పాటు చేసి గంజాయి అమ్మకాలపై దృష్టి సారించాలి.

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శ్రీలక్ష్మి పూజలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ..

సిరులతల్లికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

సెయింట్ జోసెఫ్‌లో బహుభాషా జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రతిష్టాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరించారు. 'తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి' అనే అంశంపై ద్వితీయ భాషా విభాగం అధ్యక్షులు, హిందీ ఆచార్యులు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ జర్నల్ రూపొందింది. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ భాషలలో 55 మంది అధ్యాపకులు రచించిన వ్యాసాలతో రూపొందించిన 'బహుళ శోధ్ మంజూష' బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించి మాట్లాడారు. సెమినార్ నిర్వహణతో పాటు సంపాదకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ జయలక్ష్మి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ నిర్మల, డి.కోటేశ్వరరావు, రొజీనా, సుధాప్రియ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం సర్వనాశనం



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సస్యశ్యామలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మాయ మాటలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి నేతల తీరు గురించి వివరించాలన్నారు. కనీసం ఒక బూత్‌లో మూడు రోజులు తిరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వార్డు కమిటీ, వార్డు అనుబంధ సంఘాల కమిటీ నియామకాలు సోమవారం నాటికి పూర్తి కావాలన్నారు. బూత్ ప్రెసిడెంట్లు, కమిటీలను నియమించాలని ఆదేశించారు. సోమవారం నుంచి సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లతో రోజుకి ఒకరు చొప్పున ఒక కిలోమీటర్ పరిధిలో రోడ్డు షో, ర్యాలీ నిర్వహించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, చంద్రబాబు చేస్తున్న మోసాలపై ప్రజలకు చైతన్యం కలిగించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న నితీష్ చంద్ర

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని పాండురంగాపురానికి చెందిన కావూరి నితీష్ చంద్ర రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో చెక్కును ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందించారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

నాటక రంగ ధృవతార బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్ తదితరులు



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ శ్రీనివాసరావు తదితరులు

మహారాణిపేట: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం అన్నారు. నాటక రంగంలో సంచలనాలు సృష్టించి, సినిమా రంగానికి వెళ్లి గొప్ప నటుడిగా గుర్తింపు పొందారన్నారు. తెలుగు, ఇంగ్లీషు, కన్నడ, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ నటించారని వివరించారు. కళా రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1981లో తపాలా బిళ్ల విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఇన్‌చార్జి పరిపాలనాధికారి బీవీ రాణి, సూపరింటెండెంట్ సుజాత, ఉప తహసీల్దార్లు సుధీర్, బి.రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

నాటక రంగానికి వన్నె తెచ్చిన 'బళ్లారి'

దాబాగార్డెన్స్: సమాజ ఉద్ధరణకు నాటక రంగం ద్వారా బళ్లారి రాఘవ విశేష కృషి చేశారని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు న్యాయవాది, రంగస్థల నటుడు బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని రాఘవ చిత్రపటానికి అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులతో కలిసి నివాళులర్పించారు. బళ్లారి రాఘవ అనంతపురం జిల్లా తాడిపత్రిలో నరసింహాచారి, శేషమ్మ దంపతులకు 1880 ఆగస్టు 2న జన్మించారని, ఆయన 14వ ఏట మెట్రిక్యులేషన్ పూర్తి చేసి బళ్లారిలో వార్ లా కళాశాలలో ఎఫ్ఏ, మద్రాసులోని క్రిస్టియన్ కాలేజీలో బీఏతో పాటు న్యాయ శాస్త్ర విద్య నభ్యసించారని తెలిపారు. బళ్లారి ఎక్కువగా క్రిమినల్ కేసులు వాదించడంతో ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించి, రావు బహుద్దూర్ బిరుదునిచ్చిందన్నారు. తన సంపద, సమయాన్ని నాటక రంగ పురోగతికి వెచ్చించారని కొనియాడారు. సునందిని, చాంద్ బీబీ, విజయనగర పతనం, భారత యుద్ధం, హరిచంద్ర, రామదాసు, సుభద్ర తదితర నాటకాల్లో పలు పాత్రలో నటించి అలరించడంతో పాటు నాటక రంగం ద్వారా సమాజ ఉద్ధరణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో క్రైస్తవ నాయకుల సదస్సు

తాటిచెట్లపాలెం: కైలాసపురం డొన్‌లోని గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో శనివారం క్రిస్టియన్ లీడర్స్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను కార్యవర్గ సభ్యులతో కలిసి డాక్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో జాతీయ క్రైస్తవ నాయకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశంలో క్రైస్తవులు, సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, జీవోలు, క్రైస్తవుల హక్కులు, ప్రాధాన్యతల గురించి చర్చిస్తారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలియజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు బాలరాజు, ఎల్.సామ్యేలు, జార్జిబాబు, వరప్రసాద్, బెంజిమన్, పద్మకుమార్, విజయ్‌కుమార్, బంగారి సాల్మన్‌రాజు, జాన్ మేరి, మేరి భాస్కర్, బాబ్జీ, సామ్యేల్‌సాంబ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీల మోత



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడానికి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి చూస్తోందని, అటువంటి చర్యలు నిలిపేయాలని కోరుతూ కంచరపాలెం జోన్-2 ఏపీఈపీడీఎల్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో కంచరపాలెం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్, సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు బాదుడే-బాదుడు అని నినాదాన్ని ఎత్తుకుని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. ఇప్పుడు అదే పని చేయడానికి చూస్తున్న చంద్రబాబు, లోకేష్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి 15 నెలల పాలనలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ఆ భారాన్ని ప్రజలపై మోపిందని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ జి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సానబోయిన అప్పలరాజు, ఒమ్మి అప్పారావు, సానబోయిన సోమేశ్వరరావు, డి.రామారావు, ఎం.ఈశ్వరరావు, బి.సింహాచలం, పి.మూర్తి, ఎం. కల్యాణి, పి.సత్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

ఎంవీపీ కాలనీ : తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్, వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పెదజాలరిపేటలో అవగాహన కల్పించారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఆరోగ్యంతో పాటు సంపూర్ణ పోషకాలను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్టు సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఔరా.. ఇదేం చిత్రంరా!







రోడ్డు మీద ఎవరైనా వాహనాలు పార్క్ చేస్తే ఫైన్లు వేసే పోలీసులు.. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా సీజ్ చేసిన వాహనాలను వదిలేయడం గమనార్హం. సాధారణ వాహన చోదకులకు చలానాల రూపంలో జేబులకు చిల్లులు పెట్టే పోలీసులు తమ స్టేషన్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలను వదిలేయడం విశేషం.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం